క్లుప్తంగా

స్పోర్ట్స్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నేడు

అగనంపూడి: పెందుర్తి నియోజకవర్గ పరిధిలోని వ్యాయామ ఉపాధ్యాయులకు శనివారం స్పోర్ట్స్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించనున్నట్టు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రౌతు నాగేశ్వరరావు, నియోజకవర్గ కో–ఆర్డినేటర్ లక్ష్మీరాణి, మండల కోఆర్డినేటర్ లోవరాజు తెలిపారు. లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న కార్యక్రమంలో పరవాడ, సబ్బవరం, పెందుర్తి మండలాల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు.

కాలుష్య నియంత్రణకు చర్యలు చేపట్టాలి

పరవాడ: బొగ్గు లారీల ద్వారా విడుదలవుతున్న కాలుష్యాన్ని అరికట్టడానికి అధికారులు చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరవాడలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బొగ్గు లారీలు విడుదల చేస్తున్న కాలుష్యంతో మండలంలోని అనేక గ్రామాల ప్రజలు అల్లాడుతున్నారన్నారు. బొగ్గు లారీలు నిబంధనలు పాటించకుండా రాకపోకలు సాగించడంతో రోడ్లన్నీ బూడిదమయమవుతున్నాయన్నారు. ఫలితంగా ప్రజలు ప్రయాణాలు సాగించలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధిక లోడ్‌తో రాకపోకలు సాగిస్తున్న బొగ్గు లారీలపై ఆర్టీవో అధికారులు చట్టపరమైన చర్యలు చేపట్టాలని లేని పక్షంలో ఎత్తున ఆందోళన చేపడతామని గనిశెట్టి హెచ్చరించారు.

అభివృద్ధి పథంలో స్టీల్ కో ఆపరేటివ్ స్టోర్స్



మహాజన సభలో ప్రసంగిస్తున్న స్టోర్స్ అధ్యక్షుడు జగదీశ్వరరావు

ఉక్కునగరం: కో ఆపరేటివ్ స్టోర్స్‌లో వినూత్న మార్పులు తీసుకురావడం ద్వారా అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్తున్నామని స్టీల్‌ప్లాంట్ కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షుడు బి.టి.జగదీశ్వరరావు తెలిపారు. స్టీల్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన స్టోర్స్ మహాజన సభలో ఆయన మాట్లాడారు. 2022–23 ఏడాదికి గాను సభ్యుల షేర్ క్యాపిటల్‌పై ఆరు శాతం వడ్డీ చెల్లించేలా కమిటీ నిర్ణయం తీసుకుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి నాగభూషణం, ఉపాధ్యక్షుడు ఆకుల నూకరాజు, కోశాధికారి రామకృష్ణ, డైరెక్టర్లు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం

సీతమ్మధార: బాలల హక్కుల పరిరక్షణ నగరంగా విశాఖను తీర్చిదిద్దుదామని పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ అయ్యనార్ అన్నారు. ఇటీవల నగర సీపీగా బాధ్యతలు చేపట్టిన ఆయనను చాంబర్‌లో శుక్రవారం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం కమిషనర్‌తో ఆయన భేటీ అయి వివిధ అంశాలపై చర్చించారు. బాలల భిక్షాటన, బాల కార్మిక వ్యవస్థ, బాలల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, వివిధ పిల్లల కేసులు, కారణాలు, ప్రభావిత అంశాల గురించి ప్రస్తావించారు. ఈ సందర్భంగా సీపీ రవిశంకర్ మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ, భద్రతను దృష్టిలో ఉంచుకొని నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తామన్నారు. బాలల స్నేహపూర్వక స్టేషన్లుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలతో అడుగులు వేస్తామని చెప్పారు. జిల్లా ప్రొబెషనరీ ఆఫీసర్ ఎం.శరత్ పాల్గొన్నారు.

సింహగిరిపై ఆర్జిత సేవలు పునః ప్రారంభం



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి ఆర్జిత సేవలు పునఃప్రారంభమయ్యాయి. పవిత్రోత్సవాల సందర్భంగా ఈ నెల 24 నుంచి 28 వరకు అన్ని ఆర్జిత సేవలు రద్దు చేసిన విషయం తెలిసిందే. పవిత్రోత్సవాలు ముగియడంతో తిరిగి ఆర్జిత సేవలను పునరుద్ధరించారు. ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శుక్రవారం గరుడసేవ ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై అధిష్టంపజేశారు. అష్టోత్త శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. విశేషంగా హారతులు అందజేశారు.

అభివృద్ధి పనులకు పెద్దపీట



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: ప్రజా సంక్షేమంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ చెప్పారు. నాలుగున్నరేళ్లలో ఆయన అందించిన పాలనే ఇందుకు నిదర్శనమని అదీప్‌రాజ్ పేర్కొన్నారు. జీవీఎంసీ 96వ వార్డు పరిధి ఏకలవ్యకాలనీ, గొర్లివారి కాలనీలో శుక్రవారం ఎమ్మెల్యే మంచినీటి పైపులైను పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల నుంచి ఏకలవ్యకాలనీ, గొర్లివారి కాలనీలో ప్రజలు మంచినీటికి ఇబ్బందులు పడుతున్నట్టు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తన దృష్టికి తీసుకు వచ్చారన్నారు. వెంటనే సమస్యను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తాను తీసుకెళ్లడంతో నిధులు కేటాయించినట్టు చెప్పారు. నెలరోజుల్లోనే పనులు పూర్తి చేసి ప్రజలకు మంచినీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శరగడం నరసింహమూర్తి, మాజీ ఎంపీటీసీ గొర్లె రామునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కిల్లి అప్పారావు, లెక్కల రమేష్, లెక్కల ప్రసాద్, గొర్లె రాము, దాడి ఉమామహేశ్వరరావు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు గురుకుల విద్యార్థులు



రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ విజయకుమార్

సబ్బవరం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ జిల్లాల క్రీడా పోటీల్లో సబ్బవరం గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. పరవాడ మండలంలోని పెదముషిడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 27,28 తేదీల్లో నిర్వహించిన పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్ల ప్రిన్సిపాల్ విజయకుమార్ శుక్రవారం తెలిపారు.వీరిని పీడీ సీఎల్ఎస్ ప్రసాద్, పీఈటీ సూర్యనారాయణతో కలిసి సత్కరించి అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నవారిలో టెన్నికాయిట్ అండర్–14 విభాగంలో యు. అవినాష్, అండర్–17 విభాగంలో జె. ప్రదీప్,అండర్–19 విభాగంలో జి. రాజేష్ భార్గవ్, బాల్ బ్యాడ్మింటన్ అండర్–19 విభాగంలో కె. జగదీష్,త్రో బాల్ అండర్–19 విభాగంలో ఎన్. గణేష్,టి. నవీన్ ఉన్నారన్నారు.

చురుగ్గా ఆరోగ్య సర్వే



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

సింహాచలం: జీవీఎంసీ 93వవార్డు ప్రహ్లాదపురంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు, వృద్ధులకు వైద్య సిబ్బంది బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించారు. పలువురికి ఆరోగ్య సూచనలు అందజేశారు. త్వరలో జరగనున్న వైద్య శిబిరానికి హాజరు కావాలని కూపన్లు అందజేశారు. కార్యక్రమంలో 93వవార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసరి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష

- నేడు పరవాడ జెడ్పీ బాలుర పాఠశాలలో వైద్య శిబిరం
- ప్రారంభించనున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



ఎంపీడీవో హేమసుందర్రావు

పరవాడ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ఈ నెల 30 నుంచి అక్టోబరు 16 వరకు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో వి.హేమసుందర్రావు చెప్పారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పరవాడ జెడ్పీ బాలుర పాఠశాలలో శనివారం ఏర్పాటు చేయనున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఉదయం 9 గంటలకు ప్రారంభిస్తారని చెప్పారు. మండలంలోని ప్రజాప్రతినిధులంతా హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

70 శాతం సర్వే పూర్తి

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలో 70 శాతం ఇంటింటి సర్వే పూర్తి చేసినట్టు ఎంపీడీవో చెప్పారు. మిగిలిన సర్వే త్వరలో పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ముందుగా ప్రజల ఆరోగ్య పరిస్థితిపై సర్వే పూర్తి చేసిన ఇళ్లకు ప్రత్యేక వైద్య బృందం వెళ్లి మరో పర్యాయం వైద్య పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రాథమిక హక్కులపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులతో న్యాయ విశ్వవిద్యాలయం ప్రో బోనో క్లబ్ కన్వీనర్ భువనేశ్వరి,క్లబ్ సభ్యులు

సబ్బవరం: విద్యార్థులు ప్రాథమిక హక్కులపై అవగాహనతో పాటు కనీస న్యాయ పరిజ్ఞానం కలిగి ఉండాలని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ప్రో బోనో క్లబ్ ఫ్యాకల్టీ కన్వీనర్ భువనేశ్వరి తెలిపారు. ప్రో బోనో క్లబ్ ఆధ్వర్యంలో ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం న్యాయ శిక్షణ శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న భువనేశ్వరి ప్రసంగించారు.
నిషేధిత అంశాలు,జువైనల్ నేరాలు,గృహ హింస,బాల్య వివాహాలు,లైంగిక దాడులు,వేధింపులు,పోక్సో చట్టంతో పాటు ముఖ్యమైన, సున్నితమైన అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

నేడు పాస్ పుస్తకాల పంపిణీ

సబ్బవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన శాశ్వత భూ హక్కు –భూ రక్ష కార్యక్రమంలో భాగంగా రెండో విడతలో 10 గ్రామాల్లో సమగ్ర రీ సర్వే పూర్తయిందని తహసీల్దార్ బి. సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. దీనిలో భాగంగా ఇప్పటికే 4500 పట్టాదారు పాస్ పుస్తకాలు సిద్ధమయ్యాయని చెప్పారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ చేతుల మీదుగా రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.

సత్యదేవుని ఆలయంలో పౌర్ణమి పూజలు



సామూహిక వ్రతంలో పాల్గొన్న దంపతులు

దాబాగార్డెన్స్ : నగరంలోని ఇసుకకొండ(బాబాజీ కొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. భాద్రపద పౌర్ణమి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు జరిపారు. వేకువ జాము 4 గంటల నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు జరిగాయి. ఆలయ ఈవో బుద్ద మహలక్ష్మి నగేష్ పర్యవేక్షించారు. సాయంత్రం వరకు భక్తుల తాకిడి కనిపించింది. వేకువజాము 4 గంటలకు అనివెట్టి మండపం వద్ద సామూహిక వ్రతాలు, ప్రత్యేక పూజలు, ధ్వజస్తంభ పూజలు జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో దీపారాధన



సబ్బవరం శివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు

సబ్బవరం: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండపాల వద్ద స్వామివారికి పత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. సబ్బవరంలోని శివాలయం వద్ద బడిశాల యూత్ ఏర్పాటు చేసిన మండపం వద్ద శుక్రవారం దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్న భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు.
అలాగే రాయపుర అగ్రహారంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద నిర్వహించిన దీపారాధనలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని దీపాలు వెలిగించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలపై ఫోకస్

పర్యవేక్షణకు రెండు బృందాల ఏర్పాటు



యూపీహెచ్‌సీల్లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న జీవీఎంసీ ఏఎంవో డాక్టర్ కృష్ణంరాజు

విశాఖ విద్య: జీవీఎంసీ జోన్–8 పరిధిలోని వార్డుల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు జోనల్ కమిషనర్ యం. మల్లయ్య నాయుడు శుక్రవారం సంబంధిత విభాగాల అధికారులతో సమీక్షించారు. ప్రత్యేక వైద్య శిబిరాల నిర్వహణకు రెండు బృందాలు ఏర్పాటు చేశారు. అక్టోబర్ 4 నుంచి 30 వరకు జోన్ పరిధిలో ఎనిమిది చోట్ల వైద్య శిబిరాలు నిర్వహించడానికి యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేశారు. వైద్య శిబిరాలను ప్రజానీకం సద్వినియోగం చేసుకునేలా మున్సిపల్, సచివాలయ, వైద్య ఆరోగ్యశాఖల సిబ్బంది కాలనీల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇదే క్రమంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ఆరోగ్య పరమైన సమస్యలను ఎదుర్కొంటున్న వారి వివరాలను ముందుగానే నమోదు చేసుకుంటున్నారు. ఇలాంటి వారికి ఆ ప్రాంతంలో ఎప్పుడు వైద్య శిబిరం నిర్వహిస్తారో చెప్పడంతో పాటు టోకెట్ అందిస్తున్నారు. జీవీఎంసీ పబ్లిక్ హెల్త్ విభాగం ఏఎంవో డాక్టర్ జి. కృష్ణంరాజు శుక్రవారం పలు వార్డుల్లో పర్యటించి వైద్య సిబ్బంది చేస్తున్న సర్వేను పరిశీలించారు

వైద్య శిబిరాలు నిర్వహించే ప్రాంతాలు

- అక్టోబర్ 4న చినముషిడివాడ
- 10న చంద్రానగర్ జెడ్పీ హైస్కూల్
- 12న యూపీహెచ్‌సీ, ముత్యమాంబకాలనీ
- 17న వేపగుంట కమ్యూనిటీ హాల్ ప్రాంగణం
- 18న యూపీహెచ్‌సీ, పురుషోత్తపురం
- 20న యూపీహెచ్‌సీ, బుచ్చిరాజుపాలెం
- 25న యూపీహెచ్‌సీ, పెందుర్తి
- 30న యూపీహెచ్‌సీ, నరసింహనగర్

వివాహిత అదృశ్యం



పద్మావతి

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వివాహిత అదృశ్యమైనట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. వారు తెలిపిన వివరాలిలా.. తమ్మినేని పద్మావతి అనే మహిళ భర్త గోవిందరావు, కుమార్తెతో కలిసి కంచరపాలెంలో నివసిస్తోంది. వీరికి వివాహమై రెండేళ్లయ్యింది. ఈ నెల 24న ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిన వివాహిత తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో పద్మావతి సోదరుడు గుజ్జుల దివాకర్ కంచరపాలెం పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఈమె గతంలో కూడా ఇలాగే ఇంట్లో నుంచి వెళ్లిపోవడంతో తిరిగి తీసుకొచ్చారని పోలీసులు తెలిపారు. సీఐ ఎస్.సాయి నేతృత్వంలో ఎస్ఐ దివ్యభారతి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దిక్కు లేని వృద్ధులకు ఆశ్రయం



ఏయూటీడీ ప్రతినిధి జ్యోతిర్మయికి పైడితల్లిని అప్పగిస్తున్న పట్నాయక్



నిరాశ్రయ వసతి గృహానికి రేఖను అప్పగిస్తున్న ద్వారకా పోలీసులు

అల్లిపురం : కన్నవారి ఆదరణకు నోచుకోని వృద్ధులకు జీవీఎంసీ ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహం నిర్వాహకులు అండగా నిలుస్తున్నారు. వసతి గృహం ప్రతినిధి ప్రగడ వాసు, మేనేజర్ జ్యోతిర్మయి తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం జిల్లా, రాజాం మండలం, ఉద్వాల్ గ్రామానికి చెందిన సిరిసెట్టి పైడితల్లి కుటుంబ సభ్యుల నిరాదరణకు గురైంది. ఆగస్టు 28వ తేదీన సమాజ సేవకుడు పట్నాయక్ ఇచ్చిన సమాచారం మేరకు శివాజీపాలెం రోడ్డుపై ఉంటున్న పైడితల్లిని ఏయూటీడీ టీఎస్ఆర్ కాంప్లెక్స్ షెల్టర్ సిబ్బందికి అప్పగించారు. అప్పటి నుంచి ఆశ్రయం పొందుతున్న ఆమెకు శుక్రవారం మదర్ థెరిసా ఆశ్రమంలో ఆశ్రయం కల్పించారు. అదే విధంగా ఒడిశా రాష్ట్రానికి చెందిన రేఖ అనే వృద్ధురాలు ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురు రోడ్డుపై తిరుగుతుండగా జూన్ 23వ తేదీన టీఎస్ఆర్ కాంప్లెక్స్, ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహానికి అప్పగించారు. ఆమెకు చికిత్స అందజేసిన ఏయూటీడీ ప్రతినిధులు ఆమె ఆరోగ్యం మెరుగుపడటంతో ఆమెను కూడా మదర్ థెరిసా ఆశ్రమానికి అప్పగించినట్లు తెలిపారు.

న్యూ ఐటీఐలో ఉద్యోగ నియామకాలు



విద్యార్థులతో కార్పొరేటర్ నరసింహపాత్రుడు, హుండాయ్ కంపెనీ ప్రతినిధులు

పెదగంట్యాడ: వికాస్‌నగర్‌లోని ప్రభుత్వ న్యూ ఐటీఐలో హుండాయ్ మోటార్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ద్వారా శిక్షణ పొందిన 23 మంది విద్యార్థులకు ఉపాధి కల్పిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. కళాశాలలో శిక్షణ పొందిన మోటారు మెకానిక్ విభాగ విద్యార్థులకు శనివారం సర్టిఫికెట్లు అందించారు. ప్రిన్సిపాల్ కె.ఎస్. శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం నిర్వహించిన కార్యక్రమంలో 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు ఐటీఐ పూర్తయిన తర్వాత ఉద్యోగాల కోసం ఎదురుచూసే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు చదువుకున్న కళాశాలలోనే ప్రాంగణ ఎంపికల ద్వారా ఉపాధి పొందే అవకాశం కలుగుతోందన్నారు. ట్రైనింగ్ ఇచ్చి ఉపాధి కల్పించిన సంస్థ ప్రతినిధులకు విద్యార్థులు, వారి తల్లితండ్రులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ట్రైనింగ్ మేనేజర్ సాయి చరణ్, లక్ష్మి హుండాయ్, మ్యాంగో హుండాయ్ ప్రతినిధులు బాలరాజు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో చేనేత, హస్తకళా ప్రదర్శన



హస్తకళా ప్రదర్శన ప్రారంభిస్తున్న కేఎస్ఎన్ రావు

ఉక్కునగరం: చేనేత, హస్త కళలను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కె.ఎస్.ఎన్. రావు అన్నారు. భావనా రుషి చేనేత హస్త కళా కార్మిక సేవా సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళా ప్రదర్శనను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని రకాల వస్తువులు ఒకే చోట ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సేవా సంఘం నిర్వాహకులు ఎ.సింహాద్రి, బి.సురేష్ మాట్లాడుతూ ప్రదర్శనలో పోచంపల్లి, నారాయణపేట, ఉప్పాడ, చీరాల, మంగళగిరి, కలంకారి, ఫ్యాన్సీ, ఖాదీ, కాటన్ ప్రింటెడ్, బెంగాల్ సిల్క్, కాంతావర్క్ కాటన్, భాగల్‌పూర్ సిల్క్, బాంధిని సిల్క్, గుజరాత్ డిజైన్ టాప్స్ అందుబాటులో ఉంచామన్నారు. డోర్ కర్టెన్లు, డోర్ మ్యాట్లు, వరంగల్ టవల్స్ అండ్ బెడ్‌షీట్లు, రాజస్థానీ ప్రింటెడ్ టాప్స్, జైపూర్ టాప్స్, జైపూర్ బెడ్‌షీట్లు, ఖాదీ షర్ట్స్, సారంగాపూర్ వుడ్ ఐటమ్స్ ఉన్నాయని తెలిపారు. అక్టోబర్ 20 వరకు ప్రదర్శన ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కళాక్షేత్రం కార్యదర్శి డొక్క నర్సింగరావు, ప్రతినిధులు త్రినాథ్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ స్వామినాథన్ మరణం తీరనిలోటు



ఎంఎస్ స్వామినాథన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్యులు, తదితరులు

ఎంవీపీ కాలనీ: ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, పద్మ విభూషణ్ డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ మరణం దేశానికి తీరని లోటని ఏయూ ఎకనామిక్స్ విభాగాధిపతి ఆచార్య పల్లారావు అన్నారు. శుక్రవారం ఎకనామిక్స్ విభాగంలో స్వామినాథన్ చిత్రపటానికి ఆచార్యులు, విద్యార్థులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆచార్య పుల్లారావు మాట్లాడుతూ డాక్టర్ స్వామినాథన్ వ్యవసాయరంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి దేశాన్ని ఆహార ఉత్పత్తుల భాండాగారంగా మార్చారన్నారు. ఆయన చేసిన విప్లవాత్మక మార్పుల కృషి ఫలితంగానే దేశం ఆహార కొరతను అధిగమించగలిగిందన్నారు. ఆహార ఉత్పత్తుల సమస్యను సమర్థవంతంగా ఎదుర్కొంటూ.. ప్రపంచ దేశాలకు ఉత్పత్తులను ఎగుమతి చేసే స్థాయికి చేరామన్నారు. ప్రధానంగా 60 దశకంలో దేశానికి ఆహార కొరత నుంచి విముక్తిని కలిగించిన ఘనత స్వామినాథన్‌కు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య నాగరాజు, డాక్టర్ ఆశాలత, డాక్టర్ రామకృష్ణ, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.